సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 5 । మార్చి । 2025



సోమశిలలో 57.938 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 57.938 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం లేదు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.89,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,086
3శాతం జీఎస్టీతో	రూ.8,328
నవర (8గ్రా)	రూ.66,632

గరిష్టం/కనిష్టం
36.0 /24.6

వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 61 శాతంగా నమోదైంది.



న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 885 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 885 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ జనరల్‌కు సంబంధించి 27,613 మంది విద్యార్థులకు 26,892 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,394 మందికి 1,230 మంది హాజరయ్యారు. 164 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ 6, డీవీఈఓ 4, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 28 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఢిల్లీ వర్క్‌షాపులో ఆత్మకూరు జెడ్పీటీసీ



వర్కు షాపులో మాట్లాడుతున్న ఆత్మకూరు జెడ్పీటీసీ ప్రసన్న

నెల్లూరు (పొగతోట): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ప్రజా ప్రతినిధులకు ఢిల్లీలో రెండు రోజుల పాటు వర్కు షాపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నుంచి ఆత్మకూరు జెడ్పీటీసీ పి.ప్రసన్నకు అరుదైన అవకాశం లభించింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆత్మకూరు జెడ్పీటీసీని ప్రతిపాదించి ఢిల్లీకి పంపించారు. ఢిల్లీలో జెడ్పీటీసీ మహిళా సాధికారత, మహిళా భాగస్వామ్యం, మహిళల సాకారం, మహిళలు తదితర అంశాలపై అవగాహన కల్పించి, చర్చించారు.

'రిలయన్స్' భూముల్లో జంగిల్ క్లియరెన్స్

ముత్తుకూరు: కృష్ణపట్నంలో రిలయన్స్ విద్యుత్ ప్రాజెక్ట్ (కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్) కోసం సేకరించిన భూముల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం గతంలో సుమారు 2,600 ఎకరాలు సేకరించారు. అనంతరం కొద్ది కాలానికే పనులు నిలిచిపోవడంతో 15 ఏళ్ల నుంచి ఈ భూముల్లో ఏపుగా చెట్లు పెరిగాయి. ఇటీవల ఈ ప్రాజెక్ట్ యజమాని అనిల్ అంబానీ కృష్ణపట్నం వచ్చి భూములు పరిశీలించి వెళ్లారు. జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాలకు అప్పగించారు. యంత్రాల ద్వారా ముళ్ల చెట్లు, పొదలను తొలగించి, భూములను చదును చేసే పనులను కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వహిస్తున్నారు.

కూటమి పాలనలో వ్యవసాయ సంక్షోభం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉండడానికి కూటమి ప్రభుత్వమే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. నెల్లూరు నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది పుట్టి ధాన్యం రూ.22 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.17 వేలకు పడిపోయిందని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నా.. ప్రభుత్వం మాత్రం దిష్టిబొమ్మలా చూస్తోందన్నారు. ఆప్కాస్ ద్వారా కార్మికులు వేతనాలు తీసుకుంటుంటే దానిని రద్దు చేసి టీడీపీ నాయకులకు కాంట్రాక్ట్ ఇచ్చి 4 శాతం కమీషన్ కొట్టేసేందుకు సిద్ధపడిందని ఆరోపించారు. అదానీ, మోదీ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని టీడీపీ తాకట్టు పెడుతోందన్నారు. మార్చి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు సాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏపీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సులకే రుణాలు

- ఎమ్మెల్యే కార్యాలయాలే కేంద్రంగా లబ్ధిదారుల ఎంపిక
- గత ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికం
- కూటమి పాలనలో పార్టీ, కమీషన్లకే ప్రాధాన్యం

▸▸ అర్హత, పారదర్శకతకు పాతర

రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా మహిళలకు ఇస్తున్న సబ్సిడీ రుణాలు సిఫార్సు ఉంటేనే దక్కే పరిస్థితి కనిపిస్తోంది. రుణాల మంజూరు అంతా ఒక ఫార్సుగా జరుగుతోంది. పారదర్శకంగా రుణాలు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే జరిగిపోయింది. కూటమి ప్రభుత్వంలో యూనిట్ ఏర్పాటుతో సంబంధం లేకుండా కేవలం పార్టీ, కమీషన్లకే ప్రాధాన్యతనిస్తోంది.



ఉదయగిరి: కూటమి నేతలు ప్రతి అవకాశాన్ని తమ రాబడి పథకంగా మార్చుకుంటున్నారు. చివరకు పేదల స్వయం ఉపాధి కల్పనకు మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాల్లోనూ కమీషన్లు గుంజుతున్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేసే ఈ రుణాల్లో సబ్సిడీ గరిష్టంగా రూ.2.50 లక్షలు ఉండడంతో సిఫార్సులతో కమీషన్లు దండుకుంటున్నారు. ఈ రుణాల మంజూరు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కార్యాలయాలు కేంద్రంగా ఎంపిక జరుగుతోంది. గ్రామ స్థాయి 'పచ్చనేతల నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకు పంచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ రుణాలతో అప్పుల ఊబిలోకి..

పేద వర్గాల మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించడం కోసం స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోంది. ప్రతి ఒక్కరికి సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు ప్రచారం చేయడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు చేస్తున్నారు. మంజూరు చేసిన రుణంలో 50 శాతం రాయితీ ఉంటుంది. మిగతా 50 శాతం బ్యాంకులు రుణంగా మంజూరు చేస్తాయి. లబ్ధిదారులు తాము ఏర్పాటు చేసుకున్న యూనిట్లు ద్వారా వచ్చిన ఆదాయంతో బ్యాంకు రుణ కంతులను ఐదేళ్లలో చెల్లించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రుణాలు తీసుకునే లబ్ధిదారులు పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయే అవకాశం ఉంది. ఇందులో సబ్సిడీ గరిష్టంగా రూ.2.50 లక్షలు ఉండడంతో అందులో భారీగా 'పచ్చనేతల కమీషన్‌గా' ముందుగానే ఇచ్చుకోవాల్సి ఉంది. రుణంగా వచ్చిన డబ్బులు ఇలా కమీషన్లకు ఇచ్చుకోవడంతో మిగిలిన మొత్తంతో ఆయా యూనిట్ల స్థాపనకు అడ్డంకిగా మారనుంది. బ్యాంకర్లు రుణం మంజూరు చేయాలంటే సదరు లబ్ధిదారులు సెక్యూరిటీని చూపించాల్సి ఉంటుంది. తీసుకున్న రుణంతో యూనిట్ స్థాపించలేక.. రాబడి పొందలేక.. బ్యాంకు రుణాలు చెల్లించలేక అనేక విధాలుగా అవమానాలతోపాటు సెక్యూరిటీగా పెట్టిన ఆస్తులను సైతం కోల్పోవాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది.



వింజమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

పేరుకే ఇంటర్వ్యూలు.. అంతా తమ్ముళ్లకే

ప్రభుత్వం పేదలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. అంతా పారదర్శకమని చెప్పడంతో వేలాది మంది ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో దరఖాస్తుదారులకు ఎంపీడీఓలు, బ్యాంకర్లు కలిసి ఇంటర్వ్యూల ప్రక్రియ పూర్తి చేశారు. ఇంతలో అందరి ఎంపీడీఓలకు ఎమ్మెల్యే కార్యాలయాల నుంచి లబ్ధిదారుల ఎంపిక జాబితా తామే పంపిస్తామని, మీరు ఎలాంటి లబ్ధిదారుల జాబితా తయారు చేయొద్దని ఆదేశాలు వచ్చాయి.

జిల్లా అంతటికి 2,069 యూనిట్లే

జిల్లాలో సుమారు 25 లక్షల మంది జనాభా ఉంది. కానీ ప్రభుత్వం ప్రస్తుతం బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కుమ్మరి, కాపు వంటి ఎనిమిది కులాల కార్పొరేషన్ల ద్వారా కేవలం 2,069 యూనిట్లే మంజూరు చేసింది. ఇప్పటికే దాదాపు 18,922 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా యూనిట్లకు సంబంధించి రూ.43.12 కోట్లు కేటాయించారు. తాజాగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో 1300 యూనిట్లు మంజూరు చేశారు. త్వరలో దరఖాస్తులు తీసుకోనున్నారు.

రాజకీయ ప్రమేయంతోనే లోన్లు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతానికి భిన్నంగా సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికను పూర్తిగా రాజకీయం ప్రమేయంతో చేస్తోంది. ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల కనుసన్నల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగుతోంది. గ్రామస్థాయి టీడీపీ నేతలు జాబితా తయారు చేస్తున్నారు. కొన్ని లోన్లు తమ అనుచరులకు, మరికొన్ని లోన్లు ముందుస్తు అవగాహన ప్రకారం కమీషన్లు ఇచ్చిన వారికి ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ తరహా లోన్లు లబ్ధిదారుల ఎంపికకు అధికారులు, బ్యాంకర్లకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. ఈ కమిటీలో ఎంపీడీఓ, బ్యాంకర్లు ఉండేవారు. రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత ఉన్న వారికి లోన్లు మంజూరు చేసేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఈ ప్రక్రియ జరుగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.30 లక్షలు గోల్‌మాల్

- పోస్టల్ ఏజెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు
- తనకేపాపం తెలియదంటున్న ఏజెంట్
- లోతుగా విచారిస్తామన్న పోలీసులు

ఆత్మకూరు: పట్టణంలోని డివిజన్ పోస్టాఫీసులో పోస్టల్ ఏజెంట్‌గా ఉన్న ఇమామ్ ఖాసీం తమ సంతకాలను ఫోర్జరీ చేసి తమ ఖాతాల్లోని నగదును డ్రా చేశాడని, డిపాజిట్ చేయమని చెల్లించిన నగదును కాజేశాడని కొందరు వ్యక్తులు మంగళవారం పోలీసులు, పోస్టాఫీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన దగుమాటి నారాయణరెడ్డి, నారాయణమ్మ దంపతులు కొన్నేళ్లుగా పోస్టాఫీసులో సేవింగ్ ఖాతాల్లో డిపాజిట్ రూపంలో జమ చేస్తుండేవారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన పోస్టల్ ఏజెంట్ షేక్ ఇమామ్ ఖాసీం పరిచయం కావడంతో నాలుగైదేళ్లుగా అతని ద్వారానే నగదును డిపాజిట్ చేయించడం, అవసరమైనప్పుడు విత్‌డ్రా చేస్తుండేవారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుమార్తెలు, బంధువులైన పి సుజాత, కె స్వాతి, డి.స్వేత, డి రాజమ్మ ద్వారా కూడా పోస్టాఫీసులో ఇతని ద్వారానే ఖాతాలు తెరిపించి నగదు డిపాజిట్ చేస్తుండేవారు. ఇలా నమ్మకంగా వారి లావాదేవీలు నిర్వహిస్తున్న ఇమామ్ ఖాసీంకు వారం రోజుల క్రితం నారాయణమ్మ ఖాతా నుంచి నగదు తీసుకురావాలని సంతకం చేసి విత్ డ్రా ఫారం ఇచ్చారు. అయితే వారం గడిచినా నగదు తీసుకురాకపోవడంతో శనివారం గట్టిగా నిలదీశారు. తమ అల్లుడు సుధీర్‌రెడ్డి ద్వారా ఫోన్‌లో అడిగించారు. ఈ క్రమంలో సుధీర్‌రెడ్డి తన అత్త నారాయణమ్మను ఖాతా పాస్ పుస్తకాలు తీసుకెళ్లి పోస్టాఫీసులో విచారించగా ఇమామ్ వారం రోజుల క్రితమే ఆ నగదును తీసుకెళ్లినట్లు అధికారులు చెప్పడంతో మిగతా ఖాతాల పుస్తకాలను తెచ్చి చూశారు. నారాయణరెడ్డి ఖాతాలో రూ.13,08,800, నారాయణమ్మ ఖాతాలో రూ.12,66,000, డి రాజమ్మ ఖాతాలో రూ.3,27,800, డి స్వేత ఖాతాలో రూ.14000, కె స్వాతి ఖాతాలో రూ.43,595, పి సుజాతమ్మ ఖాతాలో రూ.87,000 ఇలా మొత్తం రూ.30,47,195 నగదు మాయమైందని గుర్తించి పోస్టల్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేను ఏ పాపం ఎరుగను

తాను ఎలాంటి మోసానికి పాల్పడలేదని 32 ఏళ్లుగా పోస్టల్ ఏజెంట్‌గా పని చేస్తున్నానని ఏజెంట్ ఇమామ్ ఖాసీం తెలిపాడు. మూడు నెలల క్రితం నారాయణమ్మ కుటుంబీకులకు సంబంధించిన డిపాజిట్ బాండ్ మెచ్యూర్ కావడంతో నగదును పోస్టాఫీసులో డ్రా చేయించి వారి వద్ద రూ.2.41 లక్షల నగదును అప్పుగా తీసుకుని, తన భార్యకు వైద్యం చేయించానన్నారు. తిరిగి రూ.80 వేలు ఫిబ్రవరిలో చెల్లించానని, ఇంకా రూ.1.61 లక్షలు అప్పు ఇవ్వాల్సి ఉందని తెలిపాడు. తనను ఆదివారం వారింటికి పిలిపించి బలవంతంగా ఖాళీ స్టాంప్‌లపై బాకీ ఉన్నానని సంతకాలు తీసుకున్నారని, కొన్ని ఖాళీ ప్రామిసరీ నోట్లపై కూడా సంతకాలు చేయించుకున్నారని, తాను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఇరువురు ఫిర్యాదులు చేశారని, పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి నిజానిజాలు నిగ్గుతేలుస్తామని సీఐ, ఎస్సైలు తెలిపారు.

ఆరోగ్యశ్రీలో డబ్బులు వసూలు చేస్తే భారీ జరిమానా

- కలెక్టర్ ఆనంద్



సమావేశంలో కలెక్టర్ ఆనంద్, ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్

నెల్లూరు(అర్బన్): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా (ఆరోగ్యశ్రీ) పథకం కింద వైద్య సేవలు పొందుతున్న రోగుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేసే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు భారీగా జరిమానాలు విధిస్తామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన క్రమశిక్షణా కమిటీ సమావేశం జరిగింది. ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పలు ఆస్పత్రుల్లో రోజు వారీ తనిఖీలు నిర్వహిస్తుండగా రోగ నిర్ధారణ కోసం అదనంగా రోగుల నుంచి 12 ఆస్పత్రుల యాజమాన్యాలు డబ్బులు వసూలు చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్‌కు వివరించారు. వీరందరికీ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వారి నుంచి వివరణ తీసుకున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రమేష్‌నాథ్, వైద్యసేవాట్రస్ట్ జిల్లా మేనేజర్ వెంకటమురళి పాల్గొన్నారు.

పూజాద్రవ్యాల విక్రయాలకు వేలం పాట

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు విక్రయించే హక్కు, భక్తులు అమ్మవారికి సమర్పించే వస్త్రాలు సేకరించుకునే హక్కు, కల్యాణ మండపం నిర్వహణ హక్కులకు సంబంధించి ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాట పర్యవేక్షణాధికారిగా పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్.రఘురామమూర్తి, టెండరుదారులు పాల్గొన్నారన్నారు.

రైతుల నెత్తిన శఠగోపమేనా!

మిల్లర్‌కు ధాన్యం అమ్మిన 250 మంది రైతులు

- ఇవ్వాల్సిన బాకీ రూ.5.60 కోట్లు
- ఏడాదిగా అడుగుతున్నా దిక్కులేదు
- మిల్లు ఎదుట ఆందోళనకు దిగిన అన్నదాతలు

నెల్లూరు (పొగతోట):
'మాయమై పోతున్నడమ్మా.. మనిషన్న వాడు
మచ్చుకైనా లేడు చూడు.. మానవత్వము ఉన్నవాడు
నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు
యాడ ఉన్నాడో కాని కంటికి కానరాడు..' అంటూ ఓ కవి రచన 'అన్నదాతలకు అచ్చు గుద్దినట్లు సరిపోతోంది. స్వార్థ పూరిత పాలకులు, మిల్లర్ల దోపిడీ దాష్టీకానికి అన్నదాతలు విలవిలలాడుతున్నారు. నెల్లూరుకు చెందిన శేఖర్‌బాబు నగరంలోని నవాబుపేట ప్రాంతంలో ఓ రైస్‌మిల్లును లీజుకు తీసుకుని, గతేడాది ఇదే సీజన్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 250 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. రైతులు, దళారులకు రూ.5.60 కోట్ల చెల్లించాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మలిచి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఏడాది కాలంగా ఆ రైతులకు, దళారులకు ధాన్యం డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడు. తమ ధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతులు, దళారులు అధికారులు, పోలీసులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేతల చుట్టూ తిరిగారు. రైతులు ఇటీవల జిల్లా స్థాయి అధికారిని సంప్రదించగా 'మీ డబ్బులు ఇప్పించడానికి నేనేమైనా రౌడీనా.. గూండానా'.. మీ ప్రయత్నాలు మీరు చేసుకోండి అంటూ సమాధానం చెప్పడంతో చివరకు మంత్రులు నారాయణ, ఆనంలను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా.. ఫలితం కానరాకపోవడంతో మంగళవారం రైతులు రైస్‌మిల్లు ఎదుట ఆందోళనకు దిగారు.



రైస్‌మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

డబ్బులిప్పించండి.. సారూ



ఏడాది క్రితం శేఖర్‌బాబుకు ధాన్యం విక్రయించాం. పక్క మిల్లుల కంటే అధిక ధర ఇస్తానంటే ఆశతో ధాన్యం విక్రయించాం. డబ్బుల కోసం ఏడాది కాలంగా తిరుగుతున్నాం. స్థానిక అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులైనా రైతులపై దయ చూపి ధాన్యం నగదు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి.

– పవన్‌రెడ్డి, రైతు, ఆత్మకూరు

అధికారులను సంప్రదించినా ఫలితం లేదు



రైతుల నుంచి ధాన్యం సేకరించి నవాబుపేటలోని శేఖర్‌బాబుకు విక్రయించాం. లోడుకు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వస్తుందనే ఆశతో రైస్‌మిల్లర్‌కు ధాన్యం సరఫరా చేశాం. ధాన్యం నగదు కోసం గతేడాది కాలంగా పడరాని పాట్లు పడుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదు. న్యాయం జరిగేలా జిల్లా అధికారులైనా చర్యలు తీసుకోవాలి.

– నర్సింహనాయుడు, దళారి

ఈ ఘటనలకు బాధ్యులెవరు?

➡ శేఖర్‌బాబు గతంలో ఓ రైస్‌మిల్లులో గుమస్తాగా పని చేసిన అనుభవంతో నవాబుపేట సమీపంలోని రైస్ మిల్లును లీజుకు తీసుకున్నాడు. రైతులను, దళారులను అధిక ధర ఇస్తానంటూ నమ్మించాడు. దీంతో రైతులు, దళారులు అధిక ధర వస్తుందని శేఖర్‌బాబుకు ధాన్యం విక్రయించారు. అటువంటి వారిలో ఓ రైతు దిగులుతో అనారోగ్యానికి గురై మృతి చెందగా, మరో దళారీ జైలు పాలయ్యాడు.

➡ ఆత్మకూరు ప్రాంతానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే దళారీ రూ.22 లక్షల విలువ చేసే ధాన్యాన్ని శేఖర్‌బాబుకు విక్రయించారు. అందులో రూ.4 లక్షల నగదు ఇచ్చాడు. మిగిలిన నగదు కోసం సుధాకర్‌రెడ్డి అనేక పర్యాయాలు రైస్‌మిల్లర్ చుట్టూ ప్రదక్షిణలు చేశాడు. రైతులు ఒత్తిడి చేయడంతో అనారోగ్యం పాలయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుధాకర్‌రెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం కనీసం రూ.20 వేలన్నా.. ఇవ్వాలంటూ ఆయన భార్య రైస్‌మిల్లర్‌ను ప్రాధేయపడింది. చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడంతో సుధాకర్‌రెడ్డి మెరుగైన వైద్యం చేయించుకోలేక మరణించాడు.

➡ రైతుల నుంచి మస్తాన్ అనే దళారీ దాన్యం సేకరించి శేఖర్‌బాబుకు విక్రయించారు. ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు మస్తాన్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతను పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడు.

➡ ఆత్మకూరుకు చెందిన అనేక మంది రైతులు శేఖర్‌బాబుకు ధాన్యం విక్రయించారు. నగదు ఇవ్వకపోవడంతో రైతులు నగదు కోసం చేయని ప్రయత్నాలు లేవు. రైతులు దళారులతో కలిసి నగదు ఇవ్వాలంటూ పోలీసులను సంప్రదించారు. సీఐ వద్ద పంచాయితీ జరిగింది. జిల్లా అధికారులు, పోలీసు అధికారులు రైతులకు న్యాయం చేయకుండా రైస్‌మిల్లర్ల వైపు నిలబడ్డారు. రైస్‌మిల్లర్లు ఇచ్చే ముడుపులు తీసుకుని కోట్ల రూపాయలు దిగమింగిన మిల్లర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

మీకు సిగ్గు, శరం ఉందా

- సచివాలయాల అడ్మిన్లపై ఆర్‌ఐ దూషణలు
- అంతే దీటుగా బదులిచ్చిన అడ్మిన్లు
- రెవెన్యూ సమావేశం రసాభాస

నెల్లూరు(బారకాసు): 'మీకు సిగ్గు, ఎగ్గు ఉందా.. మీ మొహానికి గ్రూపు–2 పరీక్ష అవసరమా.. పన్నుల వసూళ్లు సక్రమంగా చేయడం చేత కాదా' అంటూ నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయ అడ్మిన్లపై ఓ ఆర్‌ఐ అభ్యంతరకర, వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీంతో కోపంతో రగిలిపోయిన అడ్మిన్లు సైతం నీవెంత.. నీ అధికారమెంత.. అంటూ ఆర్‌ఐపై తిరగబడ్డారు. మరి కొంతమంది అడ్మిన్లు కూడా కలిసి మమ్మల్ని ఇష్టం వచ్చినట్లు మాట్లాడే అధికారం నీకెవరిచ్చారంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశం రసాభాసగా మారి గందరగోళం నెలకొంది. ఈ ఘటనకు నెల్లూరు నగర కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం వేదికైంది. నగరంలో పన్ను వసూళ్లపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశం చివర్లో ఓ ఆర్‌ఐ సచివాలయాల్లోని పన్నులు వసూలు చేసే అడ్మిన్ కార్యదర్శులను ఉద్దేశించి ఇలా పలు విధాలుగా దుర్భాషలాడుతూ కించపరిచినట్లుగా మాట్లాడారు. ఇదంతా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల సమక్షంలోనే జరిగింది. దీంతో వారు అందరికీ సర్దిచెప్పి గొడవను సద్దుమణిగేలా చేశారు. ఈ వివాదం పన్ను విధించే క్రమంలో సంబంధిత భవన యజమానుల నుంచి అధిక మొత్తంలో తీసుకున్న లంచాల్లో వాటాల పంపకంలో తేడాలు వచ్చినందునే జరిగిందని కార్యాలయ ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం కమిషనర్ సూర్యతేజ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. జరిగిన గొడవపై ఆయన వచ్చాక ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

కుటుంబ పెద్దకు జబ్బు

కళకళలాడుతున్న ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది. అనారోగ్యంతో ఇంటి పెద్ద మంచం పట్టాడు. ఉన్నదంతా వైద్యానికే ఖర్చు వడంతో తల్లీపిల్లలు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు కరుణిస్తే భర్తను కాపాడుకుంటామని భార్య కోరుతోంది. దీర్ఘకాలికంగా అతను మంచానికే పరిమితం కావడంతో వీపున పుండ్లు పడి మరో కష్టం వచ్చింది.



మంచానికే పరిమితమైన వరప్రసాద్, పక్కన ఇద్దరు కుమార్తెలు

- మంచానికే పరిమితం
- రెండు శస్త్రచికిత్సల వైఫల్యం
- ఉన్నదంతా ఆస్పత్రి ఖర్చులకే..
- సాయం కోసం ఎదురుచూపులు

దాతలు ఫోన్ చేయాల్సిన నంబర్ :
94907 78313

పొదలకూరు: పట్టణంలోని నర్సారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న వరప్రసాద్ (36)కు 2019లో వెన్నుపూసలో సమస్య ఏర్పడింది. వైద్యులు శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని సలహా ఇవ్వడంతో భార్య రేవతి అప్పులు చేసి వరప్రసాద్‌కు ఆపరేషన్ చేయించింది. దురదృష్టవశాత్తు శస్త్రచికిత్స విఫలమైంది. మళ్లీ 2021లో అష్టకష్టాలు పడి రెండోసారి ఆపరేషన్ చేయించినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో వరప్రసాద్ మంచానికే పరిమితమయ్యాడు. చాలాచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. కుటుంబ పెద్ద మంచం పట్టడంతో ఆ ఇల్లు ఆర్థికంగా చితికిపోయింది. వరప్రసాద్‌కు భవ్యశ్రీ (5 తరగతి), సాయివర్షిణి (4వ తరగతి) ఇద్దరు ఆడపిల్లలున్నారు. రేవతి కూలినాలి చేస్తూ అరకొర సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

ఖర్చు చేసినా..

దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడుతూనే ఉంది. మంచానికే పరిమితం అయిన వరప్రసాద్ వీపుపై పుండ్లు ఏర్పడ్డాయి. భర్త బాధను చూడలేక రేవతి నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. అప్పులు చేసి ఇప్పటి వరకు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వరప్రసాద్ వైద్యానికి ఖర్చు పెట్టలేని పరిస్థితిలో నేడు ఆ కుటుంబం ఉంది. దాతల సాయం కోసం ఎదురు చూస్తోంది.

కష్టంగా ఉంది



మాకు ఉన్నదంతా వైద్యానికే ఖర్చు చేశాం. మంచానికే పరిమితమైన భర్త, ఇద్దరు ఆడపిల్లలను పెట్టుకుని కుటుంబాన్ని నెట్టుకురావాలంటే చాలా కష్టంగా ఉంది. ఇలాంటి బాధలు పగవాడికి కూడా రాకూడదని భగవంతుడిని ఎప్పుడూ కోరుకుంటుంటా. దాతలు ముందుకొచ్చి సహకరిస్తే నా భర్తకు వైద్యం చేయిస్తాను.

– రేవతి, పొదలకూరు

ఆమె జీవితం.. కన్నీటి సంద్రం

తెలియని వ్యాధితో జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైంది ఓ మహిళ. వైవాహిక జీవితం ఎంతో సంతోషంగా సాగుతున్న తరుణంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో ఆమె తలకు గాయమైంది. ఆరోగ్య పరిస్థితి క్షీణించి శరీర అవయవాలు చచ్చుబడ్డాయి. భార్యపై కనికరం చూపకుండా భర్త వదిలేసి వెళ్లిపోయాడు.

మంచానికే పరిమితమైన నాగమల్లేశ్వరి, పక్కనే చిన్నారి



- రెండు సంవత్సరాలుగా మంచానికే పరిమితం
- పాలే ఆహారం
- మందుల కోసం నెలకు రూ.వేలు ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

ఆత్మకూరు: పట్టణంలోని వందూరుగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న నాగులు, తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. అందరికీ వివాహాలై ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. నాగులు తోపుడు బండిపై పండ్లు అమ్ముతుంటాడు. అతని పెద్ద కుమార్తె నాగమల్లేశ్వరికి వివాహమైంది. రెండేళ్ల క్రితం.. భర్త, ఏడాది వయసున్న కూతురితో కర్నూలులో ఆనందంగా ఉంది. ఈ క్రమంలో నాగమల్లేశ్వరి ఇంటి వద్ద జారిపడగా తలకు గాయమైంది. భర్త ఆస్పత్రిలో చూపించాడు. వ్యాధిని వైద్యులు నిర్ధారించలేకపోయారు. దీంతో ఆమెను, కుమార్తెను ఆత్మకూరులోని తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చి చూసేవాడు. ఏడాదిన్నరగా అతను రావడంలేదని నాగులు, తిరుపతమ్మలు చెబుతున్నారు.

కుమార్తెను చూసి..

నాగమల్లేశ్వరి మంచానికే పరిమితమైంది. ఆమె ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. నోట మాట లేకపోగా కాళ్లు, చేతులు సైతం చచ్చుబడ్డాయి. మంచంపై ఉన్న తల్లిని చూసి కుమార్తె ద్వారక పలకరిస్తుంది. సమాధానం చెప్పలేని స్థితిలో నాగమల్లేశ్వరి కూతురిని చూస్తూ కన్నీరు పెడుతుంటుందని నాగులు చెబుతున్నాడు. ఈయన కూడా ఏడాది కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. బండిని నెట్టుకుంటూ తిరిగి పండ్లు అమ్మలేని పరిస్థితి రావడంతో తిరుపతమ్మ కూలి పనులకు వెళ్తోంది. ఇంటికొచ్చాక నాగమల్లేశ్వరికి అన్ని సేవలు ఆమే చేస్తోంది. అసలు నాగమల్లేశ్వరికి వచ్చిన వ్యాధి ఏమిటో నిర్ధారించేందుకు చెన్నై లాంటి నగరాల్లోని ఆస్పత్రులకు వెళ్లాలని స్థానిక వైద్యులు తెలపడంతో ఇప్పటికే రూ.2 లక్షలకు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు. మందుల కోసం ప్రతినెలా రూ.6 వేల నుంచి రూ.7 వేల ఖర్చు చేస్తున్నారు. నాగమల్లేశ్వరి ఆహారం తినలేకపోవడంతో ట్యూబ్ ద్వారా పాలు మాత్రమే అందిస్తున్నారు. మందులను పాలల్లో కలిపి ట్యూబ్ ద్వారా ఇస్తున్నట్లు నాగులు కన్నీరు పెట్టుకుంటూ తెలిపాడు. దాతలు సాయం చేస్తే కుమార్తెకు చికిత్స చేయించి బతికించుకుంటామని వేడుకుంటున్నాడు.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ :
94918 28138



దాతలు సాయం చేయాలని వేడుకుంటున్న నాగులు, తిరుపతమ్మ

భానుడి భగభగలు తాళలేక..



ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పగటి పూట గరిష్టంగా 35 డిగ్రీల పైన నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో బయట తిరిగే సమయంలో అనేకమంది గొడుగులను వినియోగిస్తున్నారు. నెల్లూరులోని వీఆర్సీ సెంటర్‌లో తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

తప్పిపోయిన చిన్నారి

- గంటల వ్యవధిలోనే గుర్తింపు
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన చిన్నారిని గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. నెల్లూరులోని ముంగమూరు వారి వీధిలో శంకర్‌సింగ్ కుటుంబం నివాసం ఉంటోంది. అతను కనకమహల్ సెంటర్‌లో పవర్ టూల్స్ వ్యాపారం చేస్తున్నాడు. శంకర్ మూడేళ్ల కుమార్తె మాధవి సింగ్ మంగళవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు బాలిక కోసం చుట్టుపక్కల గాలించారు. జాడ తెలియకపోవడంతో చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఈ విషయాన్ని ఎస్పీ జి.కృష్ణకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలించారు. కాపువీధిలో చిన్నారి ఏడుస్తూ ఉండగా వినోద్‌కుమార్ అనే వ్యక్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన చిన్నారి విషయాన్ని సమీపంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న చిన్నబజారు పోలీసులకు తెలియజేశారు. వారు చిన్నారిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. గంటల వ్యవధిలోనే కుమార్తెను సురక్షితంగా అప్పగించిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారితో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, ఎస్సై

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు: ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలం బోయలచిరివెళ్ల గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సీహెచ్ అభినవ్‌శర్మ తండ్రి చనిపోవడంతో గ్రామంలోని దేవాలయంలో పూజలు నిర్వహిస్తుండేవాడు. పాలిటెక్నిక్ ఉత్తీర్ణుడయ్యాక తన తాతకు దేవాలయం పనులు అప్పగించి కార్లు అద్దెకు తిప్పుతున్నాడు. ఈ క్రమంలో దగదర్తి మండలం దుండిగం గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అతడికి పరిచయమాయ్యాడు. అభినవ్ కార్లను శ్రీకాంత్ తీసుకొని తాను హైదరాబాద్ – గుంటూరు మధ్య అద్దెకు తిప్పుతానని నమ్మించాడు. అభినవ్ తన కార్లతోపాటు మరో ఇద్దరి వద్ద నుంచి రెండు కార్లను అద్దెకు తీసుకెళ్లాడు. శ్రీకాంత్ అద్దె చెల్లించకపోగా పరారయ్యాడు. దీంతో అభినవ్‌కు కార్లు అప్పగించిన వారు ఒత్తిడి చేయడంతో అతనే అద్దెలు చెల్లించాడు. దీంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. శ్రీకాంత్ నుంచి సుమారు రూ.19 లక్షల నగదు రావాల్సి ఉండటం, ఇతరుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఇంటి వద్ద సూసైడ్ నోట్ రాసి నిద్ర మాత్రలు మింగాడు. అతని తల్లి, తమ్ముడు పరిశీలించి వెంటనే 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ తెలిపారు.



చికిత్స పొందుతున్న అభినవ్ శర్మ

సేదతీరుతూ..



నెల్లూరులోని దీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. పిల్లల్ని విడిచిపెట్టిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పరీక్ష ముగిసేంత వరకూ బయట చెట్టు నీడన సేదతీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. వెంకటాచలం మండలానికి చెందిన సింధు నెల్లూరు నగరంలోని రిచ్ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూ ఆమె ఇంటి నుంచి కళాశాలకు వచ్చి వెళ్లేది. ఈనెల ఒకటో తేదీన కళాశాలకు వచ్చింది. అక్కడి నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు గాలించినా జాడ తెలియకపోవడంతో సోమవారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమాంతం పెరిగిన నిమ్మ ధరలు

- బస్తా రూ.8 వేలు

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డులో రెండు రోజుల్లో నిమ్మ ధరలు అమాంతం పెరిగాయి. బస్తా (లూజు) కాయల ధర రూ.8 వేలకు పలికింది. కిలోల వంతున చూసుకుంటే రూ.70 నుంచి రూ.110 వరకు ధరలున్నట్టు వ్యాపారులు వెల్లడించారు. దీంతో రైతుల్లో సంతోషం నెలకొంది. అయితే అందరి తోటలు కాయల్లేవు. ఉన్న రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. ఈ ధరలు ఇంకా పెరుగుతాయని భావిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల నిమ్మ వినియోగం ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ మార్కెట్ ఒక్కసారిగా ఊపందుకున్నట్టు వ్యాపారులు తెలిపారు. అయితే కొన్ని సందర్భాల్లో నిమ్మ మార్కెట్ ధరలు నిలకడగా ఉండవు. ఇతర రాష్ట్రాల నుంచి ఎగుమతి పెరిగితే ఇక్కడ ధరలు తగ్గే అవకాశం కూడా ఉంది.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.110
సన్నవి : రూ.70
పండ్లు : రూ.50



ఈ కేవైసీకి రేపటి వరకు గడువు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులు ఈ–కేవైసీ, ఈ–క్రాప్ నమోదు చేయించుకునేందుకు ఈనెల 6వ తేదీ వరకే గడువు ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకున్న రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయం చేసుకోవచ్చన్నారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు నమోదు చేసుకున్న రైతుల వివరాలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- జడ్జి కరుణకుమార్



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

నెల్లూరు(టౌన్): న్యాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ ఆకాంక్షించారు. నెల్లూరు బీవీనగర్‌లోని ఆర్‌వీఎస్ కల్యాణ మండపంలో వీఆర్ న్యాయ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ లా విద్యార్థులకు జ్ఞాపికలు అందించి ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కరుణకుమార్ మాట్లాడుతూ పక్షపాతం లేకుండా పారదర్శకంగా ప్రతి ఒక్కరికీ న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ చీఫ్ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్, లా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు చేయించుకోండి

- అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి



వార్డెన్లతో మాట్లాడుతున్న శ్రీదేవి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సెలవు రోజుల్లో విద్యార్థుల చేత హాస్టళ్ల గదుల్లోని బూజు, పెట్టెల మధ్యలో ఉన్న చెత్తను తొలగించే పనులు చేయించుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి అన్నారు. నెల్లూరులోని కొండాయపాళెంగేటు సెంటర్‌లో ఉన్న ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం వార్డెన్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ప్రతి హాస్టల్లో విద్యార్థులతో కమిటీలు వేయాలన్నారు. విద్యార్థులకు కొన్ని బాధ్యతలు అప్పగించి వారి ద్వారా బూజు దులపడం, గదులను శుభ్రం చేయించడం వంటి పనులను చేయించుకోవాలన్నారు. వార్డెన్లు విధిగా స్థానికంగా నివాసం ఉండాలన్నారు. అలా వీలుకాకపోతే హాస్టల్ పనివేళల్లో అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. లేకపోతే పనివారు కూడా మీ మాట వినరని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. మాన్యువల్ హాజరును పరిగణనలోకి తీసుకోకుండా ఎఫ్ఆర్ఎస్ హాజరు ఎంతమంది విద్యార్థులకు పడుతుందో అంతమందికే డైట్ బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

మహిళ బలవన్మరణం

బిట్రగుంట: బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో శాంతమ్మ (50) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చెంచులక్ష్మీపురం గ్రామానికి చెందిన బిజ్జం వెంకారెడ్డి ఇంట్లో ఏడాది నుంచి తిరుపతికి చెందిన శాంతమ్మ అనే మహిళ పనిమనిషిగా ఉంది. ఆమె మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి స్వస్థలం, ఇతర వివరాలు పూర్తిగా తెలియకపోవడంతో కేసు నమోదు చేసుకుని ఆమె సంబంధీకులకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 119	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ (లైవ్)	: 90	లేయర్ చికెన్	: 153
బ్రాయిలర్ చికెన్	: 214		

